# 7

# జీవితమంటే ఉద్దేశం లేనిదేనా?

## (ప్రసంగి 1; 2)

జ్ఞాన సాహిత్యము అనబడే రచనలలో, ప్రసంగి గ్రంథాన్ని మనం కనుగొంటాం. జ్ఞాన సాహిత్యంలో పరమగీతము, సామెతలు, ప్రసంగి అనే మూడు పుస్తకాలను సొలొమోను రచించాడు. "దావీదు కుమారుడు యెరూషలేములో రాజైయుండిన" సొలొమోనును ప్రసంగి 1:1 రచయితగా గుర్తిస్తుంది.

వృద్ధాప్యంలో ఉన్న సొలొమోను కంటె ఈ జీవితాన్ని గూర్చి రాయడానికి యోగ్యుడైన వాడు యింకెవడైనా ఉంటాడా? సొలొమోను ప్రత్యేకించి జ్ఞానమనే వరముగలవాడు. అధికారము, ఖ్యాతి, ఐశ్వర్యంతో సొలొమోను నిండు జీవితాన్ని గడిపాడు. అందులో కొంత భాగము దేవునితో, మరి కొంత భాగము దేవుడు లేకుండ.

బైబిల్లోని ఈ భాగము అశ్రద్ధ చేయబడుతుంది, ఎందుకంటె ఈ గ్రంథపు శైలి నేడు మనకంత పరిచయమైనది కాదు. అది సులభంగా చదువుకొంటూ పోయేది కాదు ఒక్కొక్కసారి ఒకదానితో మరొకటి అతుకని అస్తవ్యస్తమైన ధోరణి కనిపిస్తుంది. నిజానికి లేఖనాల్లో ఏ భాగము నిర్దిష్టమైనది కాదు. జీవితోద్దేశం ఏమిటి అన్న క్లిష్టమైన ప్రశ్నకు జవాబివ్వడానికి ప్రసంగి ప్రయత్నిస్తుంది. "నేనిక్కడేం చేస్తున్నాను?"

నీకు ఈ గ్రంథం యొక్క ముగింపు తెలియకుంటే, ఆరంభము నిరాశతో కూడినదైనట్టు నీవు భావించవచ్చు. ఈ జీవితమంటే రచయిత ఉత్సాహములేని వాడుగాను, కలతపరచ బడినవాడుగాను కన్పిస్తాడు. జీవితము రుణపడినదిగాను, పని విలువ లేనిదిగాను, సంతోషము అర్థము లేనిదిగాను చిత్రింపబడింది. "సూర్యుని క్రింద" జీవితాన్ని గూర్చి ఈ రచన చర్చిస్తుంది. అంటే [దేవుడు లేకుండ] అనుదినము జీవించే జీవితము అని అర్థం. సంవత్సరము వెంట సంవత్సరము, తరము వెంబడి తరము సైకిలువలె అర్థం లేకుండ ప్రకృతియు, చరిత్రయు తిరుగుతున్నట్టు యిది చిత్రిస్తుంది.

రచన కొనసాగుచుండగా, జీవితపు వ్యర్థతను గూర్చి సాధారణంగా రచయిత చర్చించలేదనియు, దేవుడు లేని జీవితం వ్యర్థమైనదని చర్చించినట్టును తేలుతుంది. దేవుడు లేకుంటే, జీవితపు లాభాలు, నష్టాలు సున్నాకు సమానమౌతాయి.

ప్రసంగి విరక్తిని, నిరాశను కనుపరచే రచన కాదు. తమ జీవితాల్లోనుండి ఆయనను ఎన్నడూ విడిచిపెట్టడానికి దేవుడు ఎన్నడూ ఉద్దేశించలేదు. "వేల్పులేని పాటు వ్యర్థమే యిలయందు," అది కలతలతో నిండియుంటుంది, ఉద్దేశం లేనిదిగా మిగిలిపోతుంది. మనం నిజంగా ఆయనతోనే సంతోషంగా ఉండగలుగునట్టు దేవుడు మనలను సృజించాడు. మన జీవితాల్లో సంతోషము అర్థము అనేవాటిని దేవుడే ఉంచాడు. కేవలం

జీవించడంవలన కాకుండ – ఆయనయందు జీవించుటయందు జీవితానికి నెరవేర్పును కనుగొను తీర్మానానికి ప్రసంగి గ్రంథం మనలను నడిపిస్తుంది.

## ప్రశ్న: భూనివాస జీవితానికి ఉద్దేశమేమి? (1:3-11)

తరమువెంట తరము గతించిపోతున్నా భూమి అలాగే నిలిచియుంది (1:3–7). ప్రకృతి సంబంధమైన లోకము సైకిలులా తిరుగుతున్నట్టు సొలొమోను గమనిస్తున్నాడు. అనుదినము సూర్యుడు ఉదయిస్తున్నాడు అస్తమిస్తున్నాడు; గాలి ఉత్తరమునుండి దక్షిణం వరకు తన మార్గంలో చుట్టివస్తుంది. రుతువులు కూడ అలా మారుతూ వస్తున్నాయి. నదులు, జలపాతాలు సముద్రంలోనికి పారుతున్నాయి, అయినా సముద్రము నిండుటలేదు. లోకం దృష్టినుండి చూస్తుంటే అవన్నీ నిస్తేజంగాను, ప్రత్యేకమైన ఉద్దేశం ఏమి లేనిదిగాను కన్పిస్తుంది.

నరులు నిరంతరం పని చేస్తూ అలసిపోతుంటారు. అయినా వారెన్నడు తృప్తినొందరు (1:8–11). తన్ను సవాలు చేయునట్లు నూతనమైనదేదియు సొలొమోను కనుగొనలేక పోయాడు. ఇంతకుముందు జరుగనిది ఏదీ యిప్పుడు జరుగలేదు. చరిత్ర మరోసారి తిప్పి చెప్పుకున్నట్టు అతడు పరిస్థితులను చూచాడు. 9వ వచనంలో అతడిలా అన్నాడు: “మునుపు ఉండినదే ఇక ఉండబోవునది; మునుపు జరిగినదే ఇక జరుగుబోవునది; సూర్యుని క్రింద నూతనమైనదేదియు లేదు.”

“నూతన సాధనలలో ఏ విధంగాను వ్యత్యాసం లేదన్నట్టు” సొలొమోను ఆలోచి స్తున్నాడు. అతడు యిలా రాశాడు,

> పూర్వులు జ్ఞాపకమునకు రారు; పుట్టబోవువారి జ్ఞాపకము ఆ తరువాతనుండ బోవువారికి కలుగదు (1:11).

“మనం వెళ్లిపోయిన తరువాత మనం చేసిన దానిని ఎవరును జ్ఞాపకముంచుకొనరు” అని యిర్మీయా విలపించాడు.

ఈ సందర్భంలో నాస్తికునిగా సొలొమోను జీవితాన్ని చూచాడు. తమ జీవితం అంతానికి చేరుకున్నప్పుడు, లోకంలో నాస్తికులని గొప్పగా పేరుపొందిన కొందరు ఈలాటి భావాలనే వ్యక్తపరచారు. నరులు ఎక్కువ స్థాయికి చెందిన జంతువులకంటె అధికులుగా భావింపబడకపోయినట్టయితే, మానవ జీవితము జంతు జీవితముకంటె ఎక్కువ విలువైనదిగా ఉండదు. అర్హత, హోదా లేక గౌరవము అనే వాటికి ఏ అర్థమూ ఉండదు. కృషి, పరిచర్య అనేవి వట్టివైయుంటాయి. “నిర్మలంగా, పవిత్రంగా, స్వార్థరహితంగా, యథార్థంగా ఉండడమనేది లేనేలేదు! జంతువులా జీవించు, నీకు చేతనైనదాని పొందు! నిన్నుగూర్చి నీవు ఆలోచించుకో; జీవితమంటే యిదే, భవిష్యత్తులో యింకా ఏమి లేదు” అనే తాత్విక భావాలతో ప్రజలు ఆలోచిస్తారు. నేడు నిరీక్షణ లేని బ్రతుకులను ఎందరో బ్రతుకుతున్నారు!

## అన్వేషణ: మన భూనివాస జీవితం అంతా ఏమిటి? (1:12-2:11)

ఈ జీవిత కాలంలో మానవజాతి బాధతో కష్టపడేది దేనికి? నాస్తికులు కృషి లేక శ్రమ, కలత అనేవాటిని మాత్రమే చూస్తారు (1:13-18). "సూర్యునిక్రింద జరుగుచున్న క్రియలనన్నిటిని నేను చూచితిని; అవన్నియు వ్యర్థములే, అవి యొకడు గాలికై ప్రయాస పడినట్టున్నవి" అని సొలొమోను అన్నాడు (1:14). మన అన్యాయాలను తప్పొప్పులను తిన్నగా చేసే మార్గము లేనట్టు వారు చూస్తారు. తమ హృదయాలలో మార్పులు తేగలుగు దేవుని శక్తిని వారు గుర్తించరు. సరిగదా, దేవుని తీర్పులు అన్ని లెక్కలను సరిచేస్తుందని వారు గుర్తించరు.

సొలొమోను తన హృదయాన్ని పరిశోధించుకున్నాడు అయితే భూసంబంధమైన జ్ఞానమందు అతనికి ప్రయోజనం కన్పించకపోయింది. జీవులందరి కంటె తనకు ఎక్కువ జ్ఞానము, ఐశ్వర్యము యివ్వబడిన వాస్తవాన్ని అతడు గుర్తించాడు, అయితే అవి కూడ అతనికి కలత కలిగించాయి. తన అధిక జ్ఞానము బాధ్యతను పెంచి విచారాన్ని కలిగించింది.

ఈ జీవితపు పరమార్థం కొరకు తాను చేసిన పరిశోధనలో, సొలొమోను ప్రతి దానిని శోధించి చూచాడు. (2:1-11). సంతోషంలో అది కన్పిస్తుందేమోనని చూచాడు, అయితే అది వ్యర్థంగానే కన్పించింది. నవ్వు అర్థరహితమైంది. సంతోషాన్నేదీ అది అందించలేకపోయింది. తరువాత మత్తెక్కించే తాగుడును తాగి చూచాడు. దీనివల్ల అధికమైన జ్ఞానం పొందడానికి గాను ప్రయత్నించాడు. అటు తరువాత జీవితంలో విలాసాల ననుభవించనెంచాడు. వాటివల్ల ఈ భూమిమీద జనులు కావాలనుకున్న సంతోషాన్ని పొందదలచాడు.

చివరిగా, తన రాజ్యాన్ని విస్తరింపజేయడంలో జీవిత నెరవేర్పును పొందగోరాడు. అన్ని రకాలైన గొప్ప భవనాలను కట్టించుకున్నాడు. తనకొరకు తోటలను, ఉద్యాన వనములను పండ్ల చెట్లను నాటించుకొని వాటికి సంబంధించిన నీటి వనరులను చేయించుకున్నాడు. పనివారిని పని కత్తెలను సంపాదించుకున్నాడు. తన యింటనే పుట్టిన సేవకులు కూడ తనకున్నారు. గొర్రెమేకలమందలను, పశువులను సంపాదించు కున్నాడు. ధనం సంపాదించడంలోను, సంపదలను సంపాదించుకొనడంలోను మునిగి తేలాడు. సంస్కారయుతమైన కళలను అతడు పోషించి, గాయకులను, గాయకురాండ్రను ఏర్పరచుకొని వారిద్వారా ఆనందాన్ని పొందజూచాడు. అతని సామ్రాజ్యం భూమిమీద బహు ఘనమైనదిగా రూపొందింది. ఏది కావాలని వాంఛించాడో ఆ సమస్తాన్ని అతడు సమకూర్చుకోగలిగాడు, అయినా అతని జీవితం లోటుగనే ఉన్నట్టు అతనికి కన్పించింది.

సొలొమోనువలె భూసంబంధమైనవాటితో తమ జీవితాన్ని నింపుకొని నెరవేర్చు కుందామనుకునే లక్షలాదిమంది నేడు లోకంలో ఉన్నారు. చీకటి రాత్రిలో చిన్న దీపముగా క్రీస్తు ప్రభువు బోధలోని జ్ఞానం ప్రకాశిస్తుంది:

> భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు, తుప్పును

తినివేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు. పరలోకమందు మీకొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు (మత్తయి 6:19, 20).

## పరిశీలన: భూనివాస జీవితాన్ని గూర్చి సొలొమోను నేర్చుకున్నదేమి? (2:12-26)

చీకటికంటె వెలుగు ఎలా శ్రేష్ఠమైనదో, బుద్ధిహీనతకంటె జ్ఞానము అలాగే శ్రేష్ఠమైనదని సొలొమోను తీర్మానించుకున్నాడు (2:12-16). జ్ఞానికి ముందుచూపు ఉండగా, బుద్ధిహీనుడు చీకటిలో నడుస్తాడు - అయినా వారిద్దరికి ఒక విషయం సమానంగా ఉంటుంది. - అంటే వారిద్దరు మరణిస్తారు. అందువలన జ్ఞానిగా ఉండడంలో కొంచెం మట్టుకే ప్రయోజనముందని సొలొమోను తీర్మానిస్తాడు. రాబోవు తరములవారు బుద్ధిహీనుని ఎంతగా జ్ఞాపకం చేసికొంటారో, జ్ఞానిని కూడ అంతగానే జ్ఞాపకంచేసి కొంటారు. [ఒకవేళ జ్ఞాపకం చేసికొన్నంతమాత్రాన చచ్చినవానికి వచ్చే లాభమేమి?] భూసంబంధమైన ప్రయాణంగా కేవలం ఈ జీవితాన్ని చూచినంత మాత్రాన జీవితానికి ఏ విధమైన అర్థం ఉండదు. దేవునితో నిత్యం ఉంటాననే నిరీక్షణ నరునికి లేకపోతే, శాశ్వతంగా ఉండబోయే మేలేమీ ఉండదు. నిత్యత్వాన్ని మనస్సులో గమ్యంగా నిలుపుకొనడంతో, భూనివాస కాలము నిత్యత్వం కొరకు సిద్ధపడే, నిరూపించే స్థలంగా మారిపోతుంది. తర్ఫీదును పొంది, స్పర్ధ వహించి, గొప్ప జట్టులో చేరడానికి సిద్ధమైన ఒక క్రీడాకారునితో దీనిని పోల్చవచ్చు.

తాను కనుగొన్నవాటిని సొలొమోను పరిశీలన చేయగా, యితరులకు విడిచిపెట్టు నట్టుగా కష్టపడి ఆస్తిని సమకూర్చడం వ్యర్థమని సొలొమోను తీర్మానించుకున్నాడు (2:17-23). తన వారసుడు జ్ఞానియైయుంటాడో, బుద్ధిహీనుడైయుంటాడో ఎవరు చెప్పగలరు. వారు స్వయంగా ఒకనాటి పని కూడ చేయనప్పటికి తన వారసులు తన చేతుల కష్టార్జితమునంతా అనుభవిస్తారు. గనుక ఆస్తిని సమకూర్చుకొనడానికి కష్టించి పని చేయడం జీవితపు ఉద్దేశమైయుండకూడదని సొలొమోను తీర్మానించాడు. ఒక మనుష్యుడు తన జీవితమంతా కష్టించి ఆర్జించింది, మరణానంతరం తన శ్రమ ఫలితాన్ని మరొకడు అనుభవించ రావడం అతనికి న్యాయముగా ఉన్నట్టు తోచలేదు.

ఒక విధంగా, సొలొమోను నిజమే చెప్పుతున్నాడు, ధనపరమైన ఆస్తులకు పిల్లలను వారసులుగా చేయడంలో మనము వారికి అపకారము చేసినవారమైయుంటాం. అనేక సంవత్సరాలు అనుభవం గడించి కూడ లౌకికమైన తమ ఆస్తితో ఏమి చేయాలో ఎరుగని కొందరుంటారు. తక్కువగా యిచ్చినవారికంటె చాలా ఎక్కువగా యిచ్చినందున ఎక్కువ మంది పిల్లలు చెడిపోయారు. పిల్లలకు ఏమి యివ్వాలంటే, తమ సొంత జీవితాన్ని వారు సంపాదించుకొనడానికి అవసరమైన జ్ఞానము, అవకాశము - అనేవాటినే యివ్వాలి. అన్నిటికి మించి వారికి దేవుని గూర్చిన జ్ఞానమును, భయభక్తుల నివ్వాలి.

తాను జీవించిన కాలమంతటిలో తన చేతుల కష్టార్జితాన్ని అనుభవించుటకంటె మేలైనది ఏదీ తనకు కనబడనట్టు సొలొమోను ప్రతిపాదనలో మొదటి తలంపైయుంది

(2:24-26). మనం దేనికొరకు పని చేసినా, మనం దేనిని పొందినా అదంతా దేవుని చేతినుండి లభిస్తుంది. ఏది యివ్వడం మేలనుకొంటాడో దేవుడు దాని ప్రసాదిస్తాడు, మేలు కానిదాన్ని ఆయన తొలిగిస్తాడు. ఏది మేలైనదో, దేన్ని మనం మేనేజ్ చేయగలమో దేవునికి తెలుసు. ఒకనికి అనుగ్రహింపబడిన ఈవికి సంబంధించిన బాధ్యత ఒకడు వహించలేడు, ఒకడు వహించగలడు అని ఎరిగిన దేవుడు ఒకనియొద్దనుండి తీసి మరొకనికి యివ్వగలడు. దుర్వినియోగం చేసేవానినుండి యీవిని తీసి సద్వినియోగం చేసేవానికి ఆయన వరములను మార్చగలడు మత్తయి 25:14-30లోని తలాంతులలోని పాఠాన్ని ఈ ఉపమానములో ప్రభువు ప్రకటించాడు.

ఆయనకు మహిమ, ఘనత తెచ్చునట్లు ఉపయోగించు నిమిత్తము ఆయన మనకు తలాంతులను అనుగ్రహిస్తాడు. ఆయన యొద్దనుండి మనము వాటిని దూరం చేసిన, ఆయనకు మనం వాటిని యియ్యకపోయినా, ఆయన మనకు అంతగా దీవెనలనియ్యక పోవచ్చు.

## ముగింపు

జీవిత పరమార్థాన్ని గురించి సొలొమోను పరిశీలన, జీవితానికి సరియైన దృక్పథాన్నిస్తుంది. మనం ఏమి కలిగియున్నామనేది జీవితాన్ని అర్థ సహితంగా చేసేది కాదు, కాని మనకు ఉన్నవాటిని ఎలా ఉపయోగిస్తున్నాము అనేదానిమీద ఆధారపడి యుంది. విజయవంతమైన జీవితం పరిస్థితులమీద ఆధారపడియుండదు. జీవితము యొక్క డైరక్షనే దాని భావాన్ని తీర్మానం చేస్తుంది. దేవునివైపు మన జీవితాలను మళ్లించు కొనడానికి సొలొమోను మాటలు మనకు సహాయపడతాయి.

ప్రసంగి గ్రంథ పఠనను మనం కొనసాగిస్తుండగా, అది మన జీవితాలను ఎలా నేరుగా పైకి త్రిప్పడానికి ప్రయత్నిస్తుందో చూస్తాం. మనం తరచుగా తప్పు సంగతులకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తాం; ఏడ్వవలసిన సమయంలో మనం నవ్వుతాము, నవ్వవలసిన సమయంలో ఏడుస్తాం; భయపడకూడనప్పుడు భయపడతాం, భయపడవలసినప్పుడు భయపడం. మనం తలక్రిందులుగా ఉన్న లోకంలో జీవిస్తున్నాం. అవి విడిచిపెట్టబడిన తీరులోనే విషయాలను చూడడానికి అలవాటు పడ్డాం. వాటిని నిజంగా ఎలా చూడాలో అలా చూడడానికి కష్టపడుతున్నాం. తలక్రిందులుగా ఉన్నదాన్ని క్రింద మీదలుగా చూస్తున్నాం. మనం నైతికమైన ఆత్మసంబంధమైన సుడిగాలిచేత కొట్టబడి బాధింపబడు తున్నాం. సొలొమోనును నమ్ము! అతడు దేవుని మనస్సును పలుకుతున్నాడు.